## గౌరి - గిరి

"విద్యవాడ" ప్రజల్ని ఒకప్పుడు "ఏడుకొండలు కార్పోరేషన్" బాగా ఆకర్షించింది. షేర్వాణి రేటుకి బీర్వాలు, యాపిల్స్ రేటుకి టేబుల్స్ లోడింగ్ చేయించుకుని, యింటికెళుతున్న యిద్దరు ముగ్గుర్ని చూసి ప్రజలంతా క్యూలో నిలబడ్డారు.

బజ్జీల ధరకి ఫ్రిజ్జులు, గుండీల రేటుకి గుండిగలు, ప్లగ్గుల కాస్టుకి రగ్గులు, అగ్గి పెట్టెల వాల్యూకి ఇస్త్రీ పెట్టెలు, ఇస్త్రీ పెట్టెల ఖరీదుకి ఇనప్పెట్టెలు - అంకించుకోవచ్చుని విద్యావంతులైన విద్యవాడ ప్రజలు ఎగబడ్డారు పై ఊళ్ళనుంచి కొందరు విద్యా గర్వితులుకూడా దిగబడ్డారు.

ఎకరాలు నికరంగా అమ్మేసి, వందల ఆర్డర్లు బుక్ చేశారు. ఇరవై నాలుగ్గంటల్లో, ఇరవై నాలుగు లక్షలు వసూలు చేసి ప్రజలకి శిలువ వేసేసి, శెలపు పుచ్చుకున్నారు. శ్రీ కోర్టువారొచ్చి, ఆరుంపాతిక అద్దె యింటికి ఆరుతాళాలు వేశారు. అవి తీయించేటప్పకి, ఇంటాయనకి అరవైవేలు పోయాయి. అరవై ఏళ్ళు వచ్చాయి. చెదనపట్టిన ఇల్లు కదిలించేటప్పటికి, మరో అరవై వేలు వదిలించింది.

అయినా ఆశ వుందే ! దానమ్మ కడుపు కాల! అది మా దొడ్డ విత్తనం లెండి! ఎన్ని పిలకలైనా వేస్తుంది. ఎన్ని మొలకలైనా ఎత్తుతుంది.

ఓ రోజు సాయంత్రం. వహ్వా గోరి, వారెవా గిరి అనే యిద్దరు బంగారు బాబులు ఓ తెల్ల వ్యానులో యింటాయన దగ్గరకొచ్చారు. ఫైనాన్స్ కంపెనీ పెడుతున్నామన్నారు. ఆరింతల అద్దె యిస్తామన్నారు. అనునయించారు. అభినయించారు. బుకాయించారు. అడ్వాన్సిచ్చారు. వప్పుదారు అయ్యాడు యింటాయన!

రాత్రికి రాత్రే బోర్డు వెలిసింది.

"గౌరి అండ్ గిరి ఫైనాన్స్ ఫెడరేషన్" "పెట్టిన డబ్బుకి డబుల్, పెట్టిననాడే పట్టికెళ్ళండి".

తెల్లవారేటప్పటికి వాడవాడలా, గోడగోడలా స్లోగన్ గన్‌షాట్‌లాగా మ్రోగిపోయింది.

సూర్యోదయం వేళకి గౌరి-గిరి ఆఫీసు ప్రాంతంలో వందల జనం పోగయ్యారు. ద్వారాల మీద తారామణి హారంలాగా, ప్లాట్‌ఫారాల మీద వేళ్ళాడసాగారు. లాకుల్లో శవాన్ని చూస్తున్న జనంలాగా, బోర్డుకేసి చూడసాగారు.

అందరికీ ఆశగానే వుంది. కాని "ఏడు కొండలు" దూరంగా నున్నగా, మసక మసగ్గా కదుల్తున్నాయి.

ఇంతలో ఓ కలి పురుషుడు ధైర్యం చేసి లోపలికెళ్ళాడు. విశేషం తెలుసుకున్నాడు.

"ఈ కౌంటర్‌లో డబ్బు డిపాజిట్ చెయ్యాలి. ఆ కౌంటర్‌లో ఎప్పుడడిగితే అప్పుడు దానికి డబుల్ ఇచ్చేస్తారు."

"మీకు నష్టం కాదూ?" ఆశ్చర్యపోయారు మిష్టర్ కలిపురుష్.

"నష్టానికెవరూ బిజినెస్ చెయ్యరు సార్! మా లాభాలు మాకుంటాయి" అన్నాడు మిష్టర్ గౌరి.

"ఎలా?" అన్నాడు మిష్టర్ కలి.

"అది మా ట్రేడ్ సీక్రెట్! ఇన్‌కం టాక్స్ వాళ్ళకి కూడా చెప్పం" అన్నాడు.

కాస్సేపాగి మెల్లిగా అడిగాడు కలి. "వంద రూపాయిలైనా డిపాజిట్ చేసుకుంటారు!"

"వంద పైసలైనా మాకు డిపాజిట్టే!" అన్నాడు గౌరి.

"మరి?....ఇచ్చిననాడే పట్టుకెళ్ళచ్చు... అంటే ఇటు డిపాజిట్ చేసి?...... అటు అడిగితే?.... ఇస్తారా?"

"వెంటనే యిచ్చేస్తాం."

"ఆ!"

"రూలంటే రూలే సార్! లేకపోతే మేం వ్యాపారాలు చెయ్యలేం."

భయం భయంగా వంద రూపాయలు తీసి ఇచ్చాడు కలి పురుషుడు. వెంటనే రసీదు వ్రాసి ఇచ్చాడు గౌరి. చుట్టూ తిరిగి, అవతలి కౌంటర్ దగ్గరికి పరిగెత్తాడు కలి. గిరి రశీదు మీద స్టాంపంటించి, కౌన్సిల్ చేసి, ఇరవై పది రూపాయిల నోట్లు లెక్క పెట్టి మరీ ఇచ్చాడు.

బయటికొస్తున్న కలి పురుషుడి చుట్టూ చేరారు జనం. వెంటనే మరో యుగపురుషుడు బయల్దేరాడు. ఇటు పది, వంద రూపాయిల నోట్లు డిపాజిట్ చేశాడు. "మా కస్టమర్సే మా దేవుళ్ళు" అంటూ లెక్క కూడా పెట్టకుండా, నిమిషంలో వెయ్యి రూపాయిలకి రశీదిచ్చాడు గౌరి. గిరి అవతల ఐదు నిమిషాల్లో రెండు వందల, పది రూపాయల నోట్లు లెక్కపెట్టి ఇచ్చాడు. అన్నీ ఖచ్చితమైన నోట్లే! కోయంబత్తురు నోట్లు కాదు.



అంతే ! జనం మధ్యలో ఫిరంగి వేలినట్లైంది. ఆఫీసు లోపలికి కొందరూ, దిక్కులకి కొందరూ పరిగెత్తారు. పదింటికల్లా చెట్టుమీది పిట్టా, రోడ్డుమీది గొడ్డూ కూడా లైన్లో దూరిపోయాయి.

సరిగ్గా లెక్కకూడా పెట్టకుండా, నిమిషంలో డబ్బు తీసుకుని రశీదు ఇచ్చేస్తున్నాడు ఇటు గౌరి. గిరి అటు పది నిమిషాల్లో లెక్క పెట్టి మరీ డబుల్ డబ్బు ఇచ్చేస్తున్నాడు. ఎక్కడినుంచో ఒక తెల్ల వ్యాను ప్రతి పావుగంటకీ హడావిడిగా వస్తోంది. కొన్ని నల్ల డబ్బాలు లోపలికి తెస్తోంది. కొన్ని నల్ల డబ్బాలు బయటికి చేరవేస్తోంది.

బాగా ఎండ ఎక్కేటప్పటికి, ఎవరెవరో తెలీడం లేదు. బందెల దొడ్డిలాగా వుంది. ఇద్దరు యూనిఫారం గార్డులు, నలుగురు మగ వలంటీర్లు, ఆరుగురు ఆడ వలంటీర్లు, తోసుకుంటున్న జనాన్ని లాఠీలు పుచ్చుకుని కంట్రోల్ చేస్తున్నారు.

మిట్ట మధ్యాహ్నం వేళకి గిరి కౌంటర్ క్లోజ్ చేశాడు. "భోంచేసొస్తా" అని కేకేశాడు.

"వెంటనే రా! తిరిగి అన్నాడు గౌరి. నువు 'టీ' తాగే వేళకి వచ్చేస్తా" నని వ్యానెక్కాడు గిరి.

పావుగంటలో మళ్ళీ వ్యానొచ్చింది. కొన్ని నల్ల డబ్బాలు చేరవేసింది. మళ్ళీ వ్యాన్ వచ్చేవేళకి గిరి కౌంటర్ క్లోజ్ చేశాడు.

"గార్డ్స్!" అంటూ గర్జించాడు.

"ఇప్పుడే టీ తాగి వస్తా! లోపల కాష్ జాగ్రత్త" అని హూంకరించాడు.

"యస్సర్!" అని అటెన్షన్‌లో నిలబడ్డారు గార్డ్స్! గౌరి వ్యాన్ ఎక్కాడు. వ్యాన్ కదిలింది.

తర్వాత గంటన్నరాగి, "ఊ....ఊ.....ఊ...." అంటూ పోలీస్ వ్యాన్ వచ్చింది. జనాలు ఘెల్లుమన్నారు. లెక్కలు చూస్తే కోటిన్నర గౌరిగిరి.

గోడమీద పెరిగిన మిరప పూలు విరగబడ్డాయి.